# 16. మంటలు! మంటలు!! మంటలు!!!

ప్రతిరోజు వెంకటేశ్వరులు పదిగంటలకు తోటకి వెళ్తాడు.

పొద్దున్నలేచి కాల్యాలు తీర్చుకొని, కాఫీతాగి, దినపత్రికలు చదివి పిమ్మట స్నానం చేస్తాడు. వెంకటేశ్వరస్వామికి ఊదొత్తులు వెలిగించి, భార్య అరుంధతి పెట్టిన టిఫిన్‌తిని, కారులో, పట్టణం సరిహద్దులకు ఇరవైకిలోమీటర్ల దూరంలో ఉన్న తోటకి వెళ్తాడు. అక్కడ పనివాళ్లతో గడిపి మధ్యాహ్నం ఒంటిగంటకు ఇల్లు చేరుకుంటాడు. అతని దిన చర్యలో క్రమం తప్పనిభాగమిది.

వెంకటేశ్వరులు ఇల్లు ఎకరం జాగాలో ఉంది. రెండంతస్తుల మేడ అది. పై అంతస్తులో అతడు కుటుంబంతో ఉంటున్నాడు. దిగువ భాగంలో అతని ఆఫీసుఉంది. మేనేజరు, ముగ్గురు గుమస్తాలు, ఒక టైపిస్టు, ఇద్దరు ఎటెండెంట్లు, ఇద్దరు బంట్రోతులు ఆఫీసులో పనిచేస్తారు. మధ్యాహ్నం మూడు నుండి అతడు ఆఫీసు వ్యవహారాలు చూసుకుంటాడు.

వెంకటేశ్వరులు పొద్దున్న దినపత్రిక చూస్తూ చేష్టలు దక్కిఉండిపోయాడు. అతనికి ఏంచెయ్యడానికి తోచలేదు. తొందరగా స్నానం ముగించుకుని, టిఫిన్ తిని, తోటకి వెళ్లడానికి బదులు, అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాదు వెళ్లాడు.

అరుంధతి తమ్ముడు పురుషోత్తమరావు. అతడు రెండు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి, ఈ మధ్యనే రాష్ట్ర పశు సంవర్ధనశాఖకి మినిస్టరయాడు. అతడు బాపట్ల కాలేజీలో చదివి, అక్కడే పి.హెచ్.డి. పట్టం కూడా తీసుకున్నాడు. ఎమ్మెల్యే కాకముందు మూడు సంవత్సరాలు ఫీల్డులో పనిచేశాడు. అనుభవం గడించాడు.

అరుంధతికి ఒక్కడే తమ్ముడు, ఆమె తల్లిదండ్రులు చిన్నతనంలోనే పోయారు. అప్పటి నుండి అరుంధతి దగ్గిరే పురుషోత్తమరావు పెరిగాడు. వెంకటేశ్వరులు అతనికి చదువు చెప్పించాడు. పి.హెచ్.డి. పట్టం తీసుకునేవరకు చదివించాడు. పురుషోత్తమరావు ప్రొఫెసరుగా ఉద్యోగంలో చేరుతానన్నాడు. వెంకటేశ్వరులు బావమరదికి బాగా నచ్చజెప్పి అతనిని రాజకీయాలవేపు మళ్లించాడు. తనపరపతిని వినియోగించి ఎమ్మెల్యేగా ఎన్నికలలో గెలిపించాడు.

పురుషోత్తమరావు తననిజాయితీతోను, మంచి గుణాలతోను, ఆకర్షణీయమైన రూపంతోను, సునిశితమైన తెలివితేటలతోను అందరికి ఆప్తుడయాడు. రెండు సంవత్సరాలలో మంత్రి పదవికి అర్హతను సంపదించాడు.

పురుషోత్తమరావు ఎమ్మెల్యే అయిన తొలిసంవత్సరంలో సామాన్యుల కుటుంబం

నుండి ఒక అమ్మాయిని ఎంచుకుని నిరాడంబరంగా పెళ్లిచేసుకున్నాడు. ఆ అమ్మాయి పేరు సుశీల, అరుంధతివలెనే ఉత్తమురాలు.

వెంకటేశ్వరులు ముందుగానే టెలిఫోను చేసి వెళ్లడం చేత పురుషోత్తమరావు బంగళాలోనే ఉన్నాడు. అసెంబ్లీ కూడా ఆరోజులేదు.

"బావగారు! రండి!" సాదరంగా అతడు వెంకటేశ్వరులుని ఆహ్వానించాడు.

వెంకటేశ్వరులంటే పురుషోత్తమరవుకి చాల గౌరవం. తను ఈ స్థితికి రాడానికి బావగారే కారణమని అతడు ఎప్పుడూ భావిస్తాడు.

లోపల నుండి సుశీలవచ్చి, అన్నగారిని అరుంధతి గురించి అడిగి, కాఫీతెచ్చి బావమరదులకు ఇచ్చింది.

"పురుషోత్తం, నువ్వు ఇవాళ పేపరు చూశావా?" అడిగాడు వెంకటేశ్వరులు తాను తెచ్చిన దినపత్రిక చూపిస్తూ.

"ఇంకా చూడలేదు." అన్నాడు పురుషోత్తమరావు.

"దీని ఆరోగ్యానుబంధంలో విశిష్టమైన వ్యాసం ఒకటి ఉంది. అదినాకు సరిగా బోధపడలేదు."

పురుషోత్తమరావు ఆ పత్రికానుబంధాన్ని చాల శ్రద్ధతో చదివాడు. తరువాత కొంతసేపు ఆలోచించి మరీచెప్పాడు. "బావగారు! పై దేశాల నుండి మన దేశానికి అక్టోబరు నుండి పక్షులు వలసవస్తాయి. వాటితోపాటు ఏవియన్ ఫ్లూ లేక బర్డ్‌ఫ్లూ రావడానికి అవకాశముంది."

"ఏవియన్ ఫ్లూ అంటే ఏమిటి?"

"ఏవియన్ ఇన్‌ఫ్లూయంజా. దీనినే బర్డ్‌ఫ్లూ అంటారు. ఈ ఇన్‌ఫ్లూయంజా వైరస్‌లు సహజంగా పక్షులలో కనిపిస్తాయి. ఇది చాలప్రమాదకరమైన సాంక్రమిక వ్యాధి. పక్షులలో ఇది త్వరగా వ్యాపిస్తుంది. పెంపుడు పక్షులైన కోళ్లు, బాతులు, టర్కీకోళ్లకు వచ్చి, వాటిని తీవ్రమైన అనారోగ్యం కలిగించి చంపుతుంది."

"మనుష్యులకు ఈ వ్యాధి వస్తుందా?"

"సాధారణంగా రాదు. ఎనిమిది ఆసియ దేశాలలో 2003-2004 సంవత్సరాలలో, పక్షులలో ఈ వ్యాధి సోకింది. హెచ్ 5 ఎన్ అన్న వైరస్ దీనికి కారణం. ఇంకా ఈ వ్యాధి విజృంభిస్తున్నది. ఈజిప్టు, టర్కీ, రొమేనియా దేశాలలో కోళ్లకు ఈ వ్యాధి సోకింది. మనుష్యులలో ఈ వ్యాధి కంబోడియా, ఇండోనేసియా, థాయ్‌లాండ్, వియత్నాం దేశాలకు ప్రాకింది."

"కొంచెం వివరంగా చెప్పు."

"హాంకాంగ్‌లో ఇటీవలెనే 18మందికి ఈ వ్యాధి తాకింది. రోగులకు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు కలిగాయి. వారిలో 6గురు చనిపోయారు. అప్పటి నుండి మనుష్యులలో ఈ వ్యాధి వ్యాపించడం మొదలయింది."

"మానవులలో వచ్చే బర్డ్‌ఫ్లూ లక్షణాలేమిటి?"

"మామూలు ఇన్‌ఫ్లూయంజా లక్షణాలు, అంటే జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఒళ్ళునొప్పులు కనిపిస్తాయి. ఇవికాక కంటి జబ్బులు, న్యూమోనియా, చాల తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు సంభవించి ప్రాణాపాయకరపరిస్థితులకు దారితీస్తాయి."

"దీని వ్యాప్తి ఎలా ఉంటుంది?"

"చాల తీవ్రంగా ఉంటుంది. చాల ప్రాణులకు, చాల ప్రదేశాలకు ఇది విస్తరిస్తుంది."

"ఇంకా తెలుసుకోవలసిన విషయాలు ఉన్నాయా?"

'వ్యాధి సోకిన పక్షి, తన గుడ్ల ద్వారా తీవ్రమైన వ్యాప్తికి దారితీస్తుంటుంది. వ్యాధి లక్షణాలు మారుతూ ఉంటాయి. ఒకరి మీద పనిచేసిన మందులు మరొకరిమీద పనిచేయవు. మందులు తయారు చేయడంలో ఇబ్బంది కలుగుతుంది."

"మనుష్యులలో ఈ వ్యాధి రాకుండా, టీకామందు అంటే వ్యాక్సిన్ కనిపెట్టలేదా?"

"హాంకాంగులో మొట్టమొదటి మానవుడికి బర్డ్ ఫ్లూ వచ్చిన దగ్గిర నుంచీ వాక్సీన్ తయరుచేసే ప్రయత్నాలు మొదలయాయి. వాక్సీన్ తయారయేసరికి మరికొన్ని నెలలు పట్టవచ్చు."

"ఈ వ్యాధి వ్యాపించకుండా ప్రభుత్వం ఏవేనా చర్యలు తీసుకుంటున్నదా?"

"ప్రపంచంలో అన్ని దేశాలతోపాటు మనదేశపు శాస్త్రవేత్తలు పరిస్థితులను చాల జాగ్రత్తగా అధ్యయనం చేస్తున్నారు."

"దీనివలన మనకు భయంలేదు కదా?"

పురుషోత్తమరావు నవ్వాడు.

"బావగారు! మీకు వచ్చిన భయమేమీ లేదు. మేమందరం ఉండనే ఉన్నాం. మీరు ధైర్యంగా ఉండండి. ఈ వ్యాధి మనదేశాన్ని తాకలేదు."

సుశీల, పురుషోత్తమరావు బలవంతం చేసినా, భోజనం చేయడానికి వెంకటేశ్వరులు ఇష్టపడలేదు. ఇంటి దగ్గిర అరుంధతి తనకోసం వేచియుంటుందని చెప్పి వెళ్ళిపోయాడు.

కారులో తిరిగి వస్తుంటే అతని ఆలోచనలు పరిపరివిధాలపోయయి.

వెంకటేశ్వరులు చాల మోతుబరి కోళ్ల వ్యాపారి. అతని కోళ్ల ఫారమ్‌లో ముప్పైవేల కోళ్ళున్నాయి. అతడు కోడిగుడ్లను, బ్రాయిలర్ కోడిమాంసాన్ని గల్ఫ్‌దేశాలకు ఎగుమతి చేస్తున్నాడు. కోళ్ల వ్యాపారం క్రమక్రమంగ వృద్ధిపొందింది. వేయికోళ్లతో మొదలయినది

ఇప్పుడు ముప్ఫైవేలను మించిపోయింది.

మంచి రెండంతస్తులమేడ, చేతినిండా పని, బాంకులలో డబ్బు, చాలసంస్థలకు అతను ఛైర్మన్. కాని, సంతానంలేదు. పురుషోత్తమరావుకన్న ఉత్తముడైన వారసుడెవడుంటాడు?

వెంకటేశ్వరులు ముందు జాగ్రత్తలు తీసుకున్నాడు. ఫారమ్ పారిశుధ్యం గురించి శ్రద్ధవహించాడు. కోళ్లకు బలానికని ఇంజక్షనులు ఇప్పించాడు. ఇవన్నీ జరుగుతున్నవే. కాని ఇప్పుడు మరికొంతమెలకువతో ఆ పనులు చేయిస్తున్నాడు.

నవంబరు నెల గడిచిపోయింది.

భారతదేశానికి వలసవచ్చిన పక్షులలో రెండువందల వరకు చనిపోయామని అతడేదో పత్రికలో చదివాడు. ఆవార్తకు అతడు తుళ్లిపడ్డాడు.

డిసెంబరు, జనవరి నెలల్లో కోళ్లకు మంచి సదుపాయం. జరిగింది.

కాని ఒకనాడు నిర్మలమైన ఆకాశం నుండి ఒక పిడుగు వెంకటేశ్వరులు మీద పడింది.

ఫిబ్రవరి 19 తారీకు దినపత్రికలో ముందుపేజీలో తాటికాయలంత అక్షరాలతో 'భారత్‌లోకి బర్డ్‌ఫ్లూ' అన్నవార్త వెలువడింది.

భారతదేశంలోకి ఫిబ్రవరి 18వతారీకున బర్డ్‌ఫ్లూ ప్రవేశించినట్లు ప్రభుత్వం ధృవీకరించింది.

వార్తలలో సారాంశమిది.

నిన్న, మొన్నటి దాకా తూర్పు, ఆగ్నేయ ఆసియా దేశాలను వణికించిన ప్రాణాంతకమైన బర్డ్‌ఫ్లూ (ఏనియయన్ ఫ్లూ – కొక్కెరవ్యాధి) మొట్టమొదటిసారి భారతదేశంలోకి అడుగు పెట్టింది. తూర్పు ఆసియాలో వందమంది ప్రాణాలను బలితీసుకున్న ఈ వ్యాధి ఇప్పుడు మహారాష్ట్రలోని నందుర్బార్, ధూళే జిల్లాలలో విజృంభించింది. వ్యాధిసోకిన కోళ్లు. 60 వేలకుపైగా మృత్యువువాతపడ్డాయి. ఈ వైరస్ లక్షణాలు కనిపించిన ఎనిమిది మంది వ్యక్తులను నందుర్బార్ జిల్లాలోని నవాపూర్ ఆస్పత్రిలో చేర్చారు. పరీక్ష కోసం 80 రక్తపునమూనాలు భోపాల్ ప్రయోగశాలకు పంపించారు. నవాపూర్ చుట్టుపట్ల 57 కోళ్లఫారాలున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా రెండు లక్షల కోళ్లను చంపి పూడ్చిపెట్టారు. మరో 8 లక్షల కోళ్లని వెంటనే చంపాలని, 2 లక్షల కోళ్లకు వాక్సీను ఇవ్వాలని నిశ్చయించారు. నవాపూర్‌లో వెంటనే మాంసం దుకాణాలను మూసివేయాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు.

బర్ట్‌ఫ్లూ సోకిన విషయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ధృవీకరించింది. భోపాల్‌కు పంపిన నెత్తుటి నమూనాలలో ఏడింటిలో ప్రాణాంతకమైన హెచ్ 5 ఎన్. ఏవియన్ ఫ్లూ

లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన కోళ్లను దూరంగా ఉంచారు. వ్యాధి సోకిన జోన్లకు నాలుగు కిలోమీటర్లు పరిధిలో ఉన్న ఫారాలలోని కోళ్లన్నింటిని చంపివేయాలని నిర్ణయించారు. కోడిమాంసం తినవద్దని ప్రజలను ప్రభుత్వం కోరింది. డాక్టర్ల బృందాలను, మందులను వ్యాధి ప్రబలిన ప్రాంతాలకు పంపించింది.

నందుర్బార్, ధూళే జిల్లాల నుండి ప్రతిరోజు పెద్ద సంఖ్యలో గుజరాత్, సూరత్‌లకు కోళ్లను పంపుతారు. ఆచోట్లలో ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కేంద్ర ప్రభుత్వం తత్క్షణం కార్యాచరణకు దిగింది.

మహారాష్ట్రలో వ్యాపించినది 'మన్మోడి' అన్న వ్యాధి అని, ప్రజలను భయాందోళనలు సృష్టించవద్దని భారత పౌల్ట్రీ పరిశ్రమ ఛైర్మన్ బహుళజాతి కంపెనీలు తమ మందులు అమ్ముకోడానికి పన్నిన కుట్ర అని అన్నారు.

ఆ పత్రికలోనే కొన్ని జాగ్రత్తలు కూడా సూచించారు. విదేశాలకు వెళ్లే ముందు టీకాలు వేయించుకోవాలి. విదేశాలలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లకూడదు. బయట దొరికే మాంసాహారం తినరాదు. ఆహారం తీసుకునే ముందు డెట్టాలులో చేతులు కడుక్కోవాలి. పిల్లలు పక్షులతో, జంతువులతో ఆడకూడదు. పచ్చిగుడ్ల పెంకుపైన పక్షుల విసర్జితాలు ఉంటాయి. కాబట్టి వీలయినంతవరకు వాటిని ఉపయోగించరాదు. పక్షుల గుడ్లు, వాటి మాంసాన్ని బాగా ఉడకబెట్టితినాలి.

బర్డ్‌ఫ్లూ మొదటిసారిగా 1997లో హాంకాంగ్‌లో బయటపడింది. 18 మంది దీని బారిన పడ్డారు. ఇది పక్షులనుండి, జంతువుల నుండి మనుష్యులకు సులభంగా వ్యాపిస్తుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఇప్పటి వరకు 15కోట్లకుపైగా పక్షులు ఈ వ్యాధితో మరణించాయి.

ఇప్పటికి బర్డ్‌ఫ్లూను వెంటనే తగ్గించేమందు ఏదీ కనిపెట్టలేదు.

ఈ వ్యాధి వచ్చిన పక్షులను చంపడంవలన దాని వ్యాప్తిని అరికడుతున్నారు.

వలస పక్షులు వేసవికి ముందే భారతదేశానికి వలసవస్తాయి. కాని అనుమానించినట్లే వేసవికి ముందే ప్రమాదం ముంచుకొని వచ్చింది. కాని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నందున ఆంధ్రరాష్ట్రానికి ముప్పులేదు.

మనరాష్ట్రంలో ఏటా కోళ్ల పరిశ్రమ 2700 కోట్ల వ్యాపారంలో ఉంది. 1250కోట్ల విలువైన కోడిగుడ్లు, కోడిమాంసం ఎగుమతి అవుతాయి.

పత్రికలలో ఈ వార్తలు వెలువడిన తరువాత వెంకటేశ్వరులు ఫారమ్ నుండి పై దేశాలకు ఎగుమతులు ఆగిపోయాయి.

మరునాటి పత్రికలు కొత్త విషయాలు ప్రచురించాయి. విశాఖ పౌల్ట్రీ పరిశ్రమపై, బర్డ్ ఫ్లూ ప్రభావం తీవ్రంగా పడింది. సహజంగా ఆదివారం చికెన్‌కి మంచి మార్కెట్ ఉంటుంది. కాని ఈ ఆదివారం పెద్దగా డిమాండ్ లేకుండా పోయింది. వ్యాధి వ్యాప్తి సమాచారంతో నగరంలో 60శాతం, గ్రామీణప్రాంతాలలో 30 శాతం వరకు కోడిమాంసం విక్రయాలు తగ్గాయి. ఈ సీజనులో ప్రతి ఆదివారం సాధారణంగా రెండున్నర లక్షల రూపాయల మేరకు చికెన్ విక్రయాలు జరుగుతాయి. నెలకు 200 లక్షల రూపాయలవరకు చికెన్ విక్రయాలు ఉంటాయి.

విదేశాలలో మాదిరిగా మనరాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు తక్కువని పలువురు పౌల్ట్రీ రంగనిపుణులు పేర్కొంటున్నారు.

మరో మూడు రోజుల తరువాత వార్తలలోని విశేషాలు - ఆ రోజు వరకు 2,82,949 కోళ్లు మహారాష్ట్రలోను, గుజరాత్‌లోను చంపబడ్డాయి.

అదేరోజు ఇంగ్లీషు దినపత్రికలో వార్త - తొలి పక్షుల చావులు మహారాష్ట్రలో నందుర్బార్ జిల్లా, నవాపూర్ తాలూకాలో డైమండ్ పౌల్ట్రీ ఫారమ్ నుండి జనవరి 26వ తారీకున సంభవించాయి. కాని ప్రభుత్వానికి ఆ సంగతి వెంటనే తెలియలేదు. పత్రికలలో వార్తలు వచ్చిన తరువాత, ఫిబ్రవరి 8వ తారీకున ప్రభుత్వానికి తెలిసింది. తరువాత రెండు రోజులకు చచ్చిన పక్షుల నుంచి నెత్తురు నమూనాలు తీసి భోపాల్ పంపించారు.

రోడ్డు పక్కను చచ్చిన కోళ్లను పారబోశారు. ఈ సంగతి పత్రికల వలన తెలిసింది. చాల తక్కువ ధరలకు కోళ్లను అమ్మడానికి తీసుకుపోతుంటే ఈ సంఘటన జరిగింది.

పదిమేను రోజులకిందే కోళ్లు చచ్చిపోతుంటే రైతులు వాటిని పెరళ్లలో పూడ్చారు.

నందుర్బార్ జిల్లాలో 52 కోళ్ల ఫారములు ఉన్నాయి. 16 ఫారాలలో కోళ్లు చచ్చిపోయాయి. ఈ ఫారాల నుండి 94 మంది పనివాళ్లను క్వారంటైన్ చేశారు. పది కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉన్న ప్రదేశాలను ప్రమాద స్థలాలని పేర్కొన్నారు.

ఆ పత్రికలోనే, నవాపూర్‌కి 6 కిలోమీటర్ల దూరంలో జమ్‌తలాలో ఉన్న వైద్య బృందానికి, కోళ్లను చంపడానికి మోసుకుపోతున్న గ్రామీణుల చిత్రం ఉంది.

ఆ వార్తలతో వెంకటేశ్వరులు కుంగిపోయాడు. పొద్దున్నే ఫారాలచుట్టూ తిరిగి వచ్చేవాడు. ఏపుగా పెరిగిన కోళ్లు - వాటిమేత కోసం కొన్నివేల రూపాయలు వెచ్చించి, సకాలంలో మేత అందకపోతుందని, కొన్ని టన్నులునిలువచేశాడు.

ఆ కోళ్లన్నీ అతని ఆప్తబంధువులు

అతని ఐశ్వర్యం పెంచాయి.

అతని పరపతిని గణనీయంగా వృద్ధి చేశాయి.

ఫిబ్రవరి నెలలో భారతదేశంలోకి బర్డ్‌ఫ్లూ ప్రవేశించిన తరువాత పురుషోత్తమరావు వెంకటేశ్వర్లుని పౌల్ట్రీఫారమ్ నిశితంగా పరిశీలించాడు. పారిశుధ్యం మొదలైన విషయాలలో గొప్ప శ్రద్ధ చూపిస్తున్న వెంకటేశ్వర్లుని అతడు అభినందించాడు.

ఫిబ్రవరి నెల గడిచిపోయింది. ఆవేళ మార్చి 10వతారీకు, శుక్రవారం. అక్కడ పౌల్ట్రీ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు ప్రోత్సాహకరమైన ఉద్యమం నడుపుతున్నారు. ఉచితంగా కోడిగుడ్లు జనసామాన్యానికి పంచుతున్నారు. బర్డ్‌ఫ్లూ బైటపడిన దగ్గిర నుంచి కోళ్ల వ్యాపారం దెబ్బతింది. ప్రభుత్వం ఎంతగా ధైర్యం చెప్తున్నా వినియోగదారులను నమ్మించలేకపోయింది.

నవాపూర్, ఉచ్ఛల్లకు తగులుతూ జలగాంవ్ జిల్లాలో నాలుగు గ్రామాలలో బర్డ్‌ఫ్లూ బయటపడింది. హటేడ్, సవాదా, సాల్వే, మారుల్ గ్రామాలలో వ్యాధి కనిపించింది. పది కిలోమీటర్లు వ్యాసార్థంలో ఉన్న ప్రదేశం వ్యాధి సోకినదిగా గుర్తించారు. ఆ ప్రాంతాలలో ఒకటే కోళ్లఫారమ్ ఉంది. దానిలో 3 వేల కోళ్లున్నాయి. ఆ పరిసరాలలో 50వేల కోళ్లను హతమార్చడానికి వైద్య బృందాలు సన్నద్ధమయాయి.

వార్తలు కొండంతలుగా వెలువడడం నుంచి కోళ్ల వ్యాపారం దెబ్బతింది. సంవత్సరానికి 20,000 కోట్ల రూపాయలు వ్యాపారమిది. ఇప్పుడు రోజుకి 200కోట్ల నష్టం వస్తున్నది. నవాపూర్, ఉచ్ఛల్ కోళ్ల వర్తకులకు ఒక కోటి ముప్ఫై నాలుగు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించారు. పధ్నాలుగు లక్షల డబ్భైఅయిదువేల కోడి గుడ్లను ధ్వంసం చేశారు. ఈ పనులన్నీ ఫిబ్రవరి 18తారీకు నుండి జరిగాయి.

ఒక దినపత్రికలో, 16 తారీకున, గురువారం నాడు, జలగాంలో జిల్లాలో అమోధా గ్రామంలో, నాశనం చేయబడిన కోళ్లను సంచులకెక్కిస్తున్న చిత్రం వెంకటేశ్వరులు కళ్లబడింది. దానిని చూస్తుంటే అతనికి ముఖం తిరిగినంత పని అయింది.

మరునాటి పత్రికలో ఉత్తరాంధ్ర ప్రాంతాలలో కోళ్ల వ్యాపారం 60శాతం తగ్గిపోయిందని, క్రమంగా అదిపుంజుకుంటున్నదని వార్త వచ్చింది. కోళ్ల వ్యాపారం వేలకొలది మనుష్యులకు ఉపాధి కల్పిస్తున్నది. పక్షులనుండి ఈ వ్యాధి మనుష్యులకు సోకుతుందని జనులు భీతిచెందుతున్నారు.

నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ వారి ఉద్యమం ఈ భయాలకు అడ్డుకట్ట వేస్తున్నది. భారతదేశంలో ఏటా 35,000 కోట్ల రూపాయల కోళ్ల వ్యాపారం జరుగుతున్నది. రమారమి మూడవవంతు మన రాష్ట్రానికి చెందినది. కోళ్లమీద ధర సగానికి సగం పడిపోయింది. కోళ్లే లేకపోతే మరి మేత దేనికి?

ఉత్తరాంధ్రలో రోజూ 25లక్షల కోడిగుడ్లు, ఒకటిన్నర లక్షల విలువగల కోడిమాంసం

ఉత్పత్తి అవుతాయి.

మరోనాటి వార్త – జలగాంవ్‌లో కోడిధర 3 రూపాయలకు పడిపోయింది. కొందరు రైతులు ఊరికే ఇచ్చి వేస్తున్నారు. కోడిగుడ్ల ధర డజను 20 రూపాయల నుండి 5 రూపాయలకు పడిపోయింది.

ఒక ఇంగ్లీషు వార పత్రికలో ప్రకటన – యూరోపియన్ యూనియన్, జపాను దేశం, భారతదేశం నుండి ఎగ్గపౌడర్ దిగుమతి చేసుకుంటున్నాయి. బర్డ్‌ఫ్లూ ప్రభావం ఈ ఎగుమతుల మీద పడలేదు. మధ్య ప్రాచ్యం నుండి దిగుమతి చేసుకునేవాళ్లు టేబిల్ ఎగ్స్ కోసం ఆత్రతతో ఎదురుచూస్తారు. ప్రస్తుతం జపాను మన దేశపు కోడిమాంసం కోసం ఆర్డర్లు పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇతర జాతీయ సంస్థలు, భారత ప్రభుత్వం కోడి మాంసం, కోడి గుడ్లు ఉపయోగించడం వలన ప్రమాదంలేదని నొక్కి చెప్తున్నాయి.

భారతదేశపు కోడిమాంసాన్ని,. గుడ్లను ప్రపంచం ఆరగించి ఆనందిస్తున్నది. మీరో మరి?

ఈ ప్రకటన నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీవారు విడుదల చేసినది.

ఒకానొక దినపత్రికలో ఒక కార్టూన్ వచ్చింది. దానిలో, ఒక బాలిక పట్టుకున్న బానరు మీద, "కాయగూరలకు మరలండి!" అని వ్రాసిఉంది.

అటు తరువాత, మరునాటి పత్రికలో, జలగాంవ్ జిల్లాలో కోళ్ల సంహారం పూర్తయిందని వ్రాసిఉంది. మొదటి 75 వేల కోళ్లను చంపాలని అనుకున్నారు. కాని పెరళ్లలోని కోళ్లను కలిసితో 95వేల వరకు సంఖ్య పెరిగింది.

జలగాంవ్ జిల్లాలో చంపిన కోళ్లకుగాను, నష్టపరిహారం 20,84,640 రూపాయలు, ప్రభుత్వం రైతులకు చెల్లించింది. 91,161 కోళ్లను చంపివేశారు.

ఉత్తరప్రదేశ్‌లో ఆలిఫడ్ జిల్లాలో, ఒక కోళ్ల ఫారమ్ నుండి మూడు రోజులలో, హెచ్చు సంఖ్యలో కోళ్లు చచ్చిపోయాయని వార్తవచ్చింది.

జలంగాంవ్ జిల్లాలో మరోనాలుగు గ్రామాలకు వ్యాధి సోకిందని వార్తలు వచ్చాయి. పారిశుధ్యం కోసం 60 వైద్యబృందాలు వెళ్లాయి.

ఆంధ్రరాష్ట్రంలో బర్డ్‌ఫ్లూలేదని బ్రాయిలర్ ఇండస్ట్రీ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ విశాఖ సభ్యులు సూచించారు. చికెన్ బాగాఉడికించి తింటే ఏ ప్రమాదం రాదన్నారు. కాని అమరునాటి ఆంగ్ల దినపత్రికలో కోడి ధర పదిరూపాయలకు పడిపోయిందని ఉంది. కోళ్లమేత గురించి సమస్య ఎదురయింది. ఎవరుకూడా మేతను అరువు ఇవ్వడంలేదు. బీచ్ ఒడ్డున ఒక చికెన్ మేలా జరిగింది. పురప్రముఖులు చాలమంది కోడిమాంసపు వంటకాలను

ఆరగించి బ్రేవ్‌మని త్రేన్చారు.

ఆ రోజు ఆంగ్ల పత్రికలో ఐక్యరాజ్యసమితి సభ్యుడి వివరణలు ఉన్నాయి. భూగోళంలో సగంభాగం బర్డ్‌ఫ్లూ వ్యాధికి బలి అయిందని అతను వాపోయాడు.

రాత్రి వెంకటేశ్వరులు రేడియో వార్తలువిన్నాడు. జలగాంవ్ జిల్లాలో చాలా గ్రామాలకు బర్డ్‌ఫ్లూ వ్యాధి పాకిందని విన్నాడు.

అన్ని వార్తలు విని అతని తల దిమ్మెక్కి పోయింది.

..............................................................................................

వెంకటేశ్వరులు ఇంటిముందు విశాలమైన కాలీజాగా ఉంది. ఆ జాగాలోచాల పెద్ద పందిరివేశారు. అక్కడ చికెన్ మేలా జరుగుతున్నది. హైదరాబాదు నుండి కోడిమాంసం వండడంలో పేరున్నవారిని తెప్పించారు. పందిరికి ఒకవేపు గాడీలను తవ్వించి కోడిమాంసపు వంటకాలను చేయిస్తున్నారు. నూరుమంది పురప్రముఖులను ఆహ్వానించారు.

పెద్ద పెద్ద బానర్లు అంతటా ప్రదర్శించారు. 'కోడిమాంసం నిరపాయకరమైనది' అనివాటి మీద వ్రాసి ఉంది.

కోడి మాంసపు విందుకు పశుసంవర్ధనశాఖ మంత్రిగారు, గౌరవనీయులైన పురుషోత్తమరావు గారిని ఆహ్వానించారు. పట్టణంలో మునిసిపల్ ఛైర్మన్, ప్రభుత్వపు అధికారులను, ప్రముఖవర్తకులను, డాక్టర్లను, కళాశాల అధ్యాపకులను - ఒకరేమిటి సమాజంలోని అన్ని శాఖల నుండి నూరుమందిని ఎంపిక చేసి ఆహ్వానించారు.

సరిగా ఒంటిగంట అయింది.

మంత్రిగారు విందు ప్రారంభించేముందు చిన్న ఉపన్యాసం చేశారు.

"మనఫారమ్‌లో కోళ్లు చాల ఆరోగ్యవంతమైనవి. పాకశాస్త్రనిపుణులు, ఈ మాంసం రుచికరంగా వండారు. మీరందరు నిర్భయంగా వంటకాలను తినవచ్చు. నేనే ముందుతిని ఈ విందును ప్రారంభిస్తాను."

కరతాళధ్వనులు మారుమ్రోగాయి.

మంత్రిగారు తినడం ప్రారంభించిన తరువాత ప్రముఖులు తినడానికి ఉపక్రమించారు.

వెంకటేశ్వరులు, ఫారమ్ మేనేజరు వద్దను పర్యవేక్షిస్తున్నారు.

చాల సంరంభంగా ఉంది.

ఇంతలో మంత్రిగారు లేచి నిలుచున్నారు. వారి నాలుక పిడచబారిపోతున్నది. జ్వరంతో శరీరం పేలిపోతున్నది. వణకిపోతూ, పడిపోబోయి, టేబిలు పట్టుకొని నిలదొక్కుకున్నారు.

అతనికి దగ్గిరలోనే ఉన్న వెంకటేశ్వరులు ఇది చూసి మెరుపులా మంత్రిగారిని సమీపించాడు. ఆయన బావగారి చెవిలో ఏదో చెప్పారు. ఇద్దరు పనివాళ్లు ఆయనను పట్టుకొని కారువరకు నడిపించారు. కారులో ఆయనను ఫర్లాంగు దూరంలో ఉన్న హెలీపాడ్ దగ్గిరికి తీసుకుపోయారు. మరొక్కపదినిమిషాలలో ప్రభుత్వంవారి హెలికాప్టర్ వచ్చి మంత్రిగారిని హైదరాబాదు తీసుకుపోయింది.

వెంకటేశ్వరులు హెలీపాడ్ నుండి తిరిగి పందిరిలోకి వచ్చేసరికి పరిస్థితి విషమించింది. చాలమంది పురప్రముఖులు జ్వరంతో వణికిపోతున్నారు. ఊపిరి తీసుకోలేక పోతున్నారు. మహాసంక్షభం - పాకశాస్త్రనిపుణులు పారిపోయారు. పురప్రముఖులు కార్లలో హాస్పిటలుకి, నర్సింగ్ హోములకు పరారయారు.

బర్డ్‌ఫ్లూ! బర్డ్‌ఫ్లూ!! బర్డ్‌ఫ్లూ!!!

జనం రెచ్చిపోతున్నారు. కొందరు లారీలలో ఫారమ్‌వేపు ప్రయాణం చేశారు.

వెంకటేశ్వరులు కర్ణాకర్ణిగా విన్నాడు. ఫారమ్‌నుండి విందుకోసం పంపిన నూరు కోళ్లలోను, తొంభై కోళ్లు దారిలోనే మెడలువాల్చాయి. పాకశాస్త్రనిపుణులు, సకాలంలో విందు ప్రారంభించలేమని, వాటితోనే వంటకాలు పూర్తి చేశారు.

వెంకటేశ్వరులు తలమోదుకున్నాడు.

కారులో చాలతొందరగ ఫారమ్ చేరుకున్నాడు. కాని ఆ సరికే జరగవలసిన ఘోరం జరిగిపోయింది. పెట్రోలుపోసి జనులు ఫారమ్‌ని తగలబెడుతున్నారు. ముప్పైవేల కోళ్లు కల్లింగ్ అక్కరలేకుండానే కాలిపోతున్నాయి. కనరుకంపు మంటలు ఆకాశంవేపు లేస్తున్నాయి.

వెంకటేశ్వరులు మంటల వేపు దూసుకుంటూ పోతున్నాడు. మండుతున్న దూలం ఒకటి అతని తలమీద పడింది.

..........................................................................................

వెంకటేశ్వరులు హఠాత్తుగాలేచి కూర్చున్నాడు. గదిచుట్టూ చూశాడు. బాగా వెలుతురు వచ్చింది. కిటికీలలోంచి చల్లనిగాలి వీస్తున్నది. ఎక్కడామంటలు కనిపించలేదు.

అతను ఫారమ్ మేనేజరుకి ఫోను చేశాడు.

"వెంకట్రావ్! అన్నీ బాగున్నట్లేనా?" రోజు అడిగినట్లే అతను అడిగాడు.

"చాల బాగున్నాయి, సార్! కోళ్లకి మేతపెడుతున్నాం. అన్నీ ఉత్సాహంతో రెక్కలాడిస్తున్నయి సార్!"

"థాంక్స్!"

వెంకటేశ్వరులు ముఖం కడుకున్నాడు. అరుంధతి తెచ్చిన కాఫీ తాగాడు. రేడియో

ఆన్‌చేశాడు.

ఎవడో ప్రబుద్ధుడి అభిభాషణ, ఆఖరి దశలో ఉంది.

"…. మనం చికెన్ హార్టెడ్ సీపుల్స్‌కారాదు. పరిస్థితిని ఎదుర్కోందాం! బర్డ్‌ఫ్లూను అదుపులో ఉంచుదాం!"

వెంకటేశ్వరుని పేలవమైన పెదవుల మీద మందహాసమొకటి తోచింది.